క్లుప్తంగా

29న గంధ మహోత్సవం

పెద్దమండ్యం: మండలంలోని కలిచెర్ల మౌలా కాపహాడ్ వద్ద గురువారం గంధమహోత్సవం నిర్వహించనున్నట్లు మౌలాకాపహాడ్ సొసైటీ అధ్యక్షులు ఖ్వాజా సయ్యద్‌షా ఆరీవుల్లా హుసేనీ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

గంధ మహోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కంటి ఆపరేషన్‌లు అవసరమైన వారికి ఉచితంగా బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం గంధ మహోత్సవం సందర్భంగా అన్నదానం చేయనున్నట్లు చెప్పారు. రాత్రి దానిష్‌ఖాన్ ఖవ్వాలిచే సూఫీ ఖావ్వాలీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

నీటి సమస్య పరిష్కరించండి



ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలోని 30వ వార్డు ఇందిరమ్మ కాలనీలో చోటుచేసుకున్న తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం సోమవారం ఆపార్టీ ఆధ్వర్యంలో 30వ వార్డు ప్రజలు కలెక్టరేట్ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఎన్ని పర్యాయాలు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో సిద్దిగాళ్ల శ్రీనివాసులు, సాంబశివ, రంగారెడ్డి, పుల్లయ్య, సురేంద్రతోపాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు



అలంకరణలో శివలింగ స్వరూపుడు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసిన శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప ప్రాంతాల భక్తులు సోమవారం కావడంతో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. స్వామి వారిని ఆలయ అర్చకులు పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డు పనులు ప్రారంభం

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు భద్రావతి నగర్‌లో సోమవారం మాజీ సర్పంచ్ ముక్కా రమేష్‌కుమార్‌రెడ్డి రూ. 8లక్షల వ్యయంతో పక్కా రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డిల సహకారంతో భద్రావతి నగర్ వీవర్స్ కాలనీలో సిమెంట్ రోడ్డును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గురుప్రసాద్, చొప్పా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంచి మార్కులు సాధించాలి



వీడ్కోలు సమావేశానికి హాజరైన విద్యార్థినులు

సిద్దవటం : ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని ఎంఈఓ శంకరయ్య చెప్పారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినుల ఫేర్ వెల్ డే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ శంకరయ్య సరస్వతీ పూజలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో రాణించి జిల్లాస్థాయిలో పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పరీక్షల సమయంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీరాములు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అర్జీదారులకు ఉచిత భోజనం



అన్నదానంలో పాల్గొన్న అర్జీదారులు

రాయచోటి టౌన్ : జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత భోజనం అందించారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సొంత నిధులతో నిర్వహించే ఈ కార్యక్రమం సోమవారంతో 49వ వారానికి చేరుకుంది.

అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి



సుండుపల్లెలో వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట(సుండుపల్లె) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఈ రాష్ట్ర మహిళా లోకం ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. సుండుపల్లె ఎంసీఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్క,చెల్లమ్మ జీవితాల్లో వెలుగు నింపడానికి ముఖ్యమంత్రి విశేష కృషి చేస్తున్నారన్నారు. అన్నింటిలో మహిళలకు అగ్రస్థానం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. ఆర్థికంగా, రాజకీయంగా మహిళలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో సుండుపల్లె ఎంపీపీ రాజమ్మ, జెడ్పీటీసీ ఇస్మాయిల్, జెసీఎస్ కన్వీనరు రహిమాన్‌ఖాన్, మాజీ ఎంపీపీ అజంతమ్మ, మండల కన్వీనరు రామస్వామిరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా వలంటీర్లకు వందనం

సుండుపల్లెలో వలంటీర్లకు వందన కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్ల సభలో ఎమ్మెలే మేడా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన అందించేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రజలకు పథకాలు అందించడంతోపాటు వారికి కావాల్సిన సేవలను అందించి వలంటీర్లు ప్రజల మన్నలను పొందారన్నారు. వలంటీర్ వ్యవస్థ దేశంలోనే చరిత్రాత్మకమన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, అధికారులు, మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఫించా, సుండుపల్లెలో ఆర్‌ఓ ప్లాంట్లను ప్రారంభం

ఫించా, సుండుపల్లె ఆర్‌ఓ ప్లాంట్స్‌ను రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. శుద్ధి చేయబడిన నీటి ప్లాంట్స్ ద్వారా అందజేస్తున్నామన్నారు. అలాగే వేసవిలో నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాల వారు నీటి సమస్యను తన దృష్టికి తీసుకురావాలన్నారు.

29 నుంచి గడికోట ఎన్నికల ప్రచారం



మాట్లాడుతున్న మండల నాయకులు

రామాపురం : రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఈ నెల 29న ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. రామాపురం మండలంలోని రాచపల్లె గ్రామం నాయునివారిపల్లెలో వెలసిన నాగారపమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి ప్రచారాన్ని ప్రారంభించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణలు సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో తెలిపారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. వీరితోపాటు సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సత్యాయాదవ్, ఉప సర్పంచ్ శివయ్య తదితరులు ఉన్నారు.

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ

సిద్దవటం : అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ సాధ్యమని నాస్కం ఫౌండేషన్ కమిటీ సభ్యుడు కప్లేవ్ అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని విద్యార్థినీ, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కప్లేవ్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు డిజిటల్ ట్యాబ్ ద్వారా కొంతమంది వాట్సాప్ మెసేజ్‌లు పెడుతున్నారన్నారు. అవన్నీ నమ్మవద్దని తెలిపారు. డిజిటల్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏవైనా మెసేజ్‌లు వస్తే మీ అకౌంట్లో నుంచి డబ్బులు పోకుండా జాగ్రత్త పడాలని డిజిటల్ ట్యాప్‌పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, వర్క్ ఇన్స్‌పెక్టర్ శివ, నాస్కం సొండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు



ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేస్తున్న అధికారులు

రాయచోటి అర్బన్ : నిబంధనలకు విరుద్ధంగా తక్కువ మైక్రాన్‌ల మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి షమీమ్‌బాషా, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావులు హోటళ్ల యజమానులను హెచ్చరించారు. సోమవారం ఉదయం మున్సిపల్, ఫుడ్ సేఫ్టీ అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించని పలు హోటళ్లపై దాడులు నిర్వహించారు. హోటళ్లలోని ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతలను పరిశీలించారు. సుండుపల్లె రోడ్డులోని ఉమా టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ పార్శిల్‌కు తక్కువ మైక్రాన్‌ల మందం కలిగి ప్రజారోగ్యానికి హానిచేసే ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుండడంతో అధికారులు ఆగ్రహించారు. వెంటనే ప్లాస్టిక్ కవర్లను సీజ్‌చేసి హోటల్ యజమానికి రూ.5 వేలు జరిమానా విధించి కేసు నమోదు చేశారు. తనిఖీలలో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మల్లికార్జున, శానిటరీ ఇన్స్‌పెక్టర్ కొండయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

ప్రజానుగుణంగా ప్రభుత్వ కార్యాలయాలు



సౌమ్యనాథస్వామి సన్నిదిలో రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట) : మండలంలోని పాటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం కార్యాలయాలను రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిలు సోమవారం రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సిబ్బందిని ఆ గ్రామంలోని ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికలలో అత్యధిగ మెజారీతో జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసి గడికోట సుబ్బారెడ్డి, పాటూరు సర్పంచ్ అక్కిరెడ్డి మోహన్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కరిముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యనాథుని సన్నిధిలో మేడా రఘునాథరెడ్డి

రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని సౌమ్యనాథస్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి అన్నారు. రాజ్యసభ సభ్యులుగా ఎంపికైన తరువాత మేడా రఘునాథరెడ్డి ఆలయానికి రావడంతో ఆలయ అధికారులు, వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారికి దర్శించుకొని, ప్రత్యేకపూజలు జరిపి, ఆలయలో 108 ప్రదక్షిణలు చేసి మొక్కు చెల్లించారు. అనంతరం ఆయన్ను టీటీడీ అధికారులు, అర్చకులు శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌమ్యనాథస్వామి తన ఇష్టమైన దైవమని, భక్తులు కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా ప్రసిద్ధి చెందారన్నారు. గతంలో తాను ఆలయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలియజేశారు. రాబోయే రోజుల్లో ఆలయం మరింత అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో మేడా శ్రావణ్ కుమార్ రెడ్డి, మేడా రోహిత్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు నాగేంద్ర మూర్తి, భువనబోయిన లక్ష్మీనరసయ్య, పాలగిరి సుధాకర్ రెడ్డి, అరిగెల సౌమిత్రి చంద్రనాథ్, నాయకులు యోగీశ్వర్ రెడ్డి, గుణయాదవ్, జి.హిమగిరినాథ్ యాదవ్, టి.కేదార్‌నాథ్ బాబు, ఎల్.నరసయ్య, ఏ.నాని, ఎస్.ప్రభాకర్, నాగసుబ్బయ్య, కె.చంద్ర, పి.చంద్రశేఖర్, సుబ్బరాయుడు, పి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఎంపీకు ఘనంగా స్వాగతం పలికారు.

రైల్వే అభివృద్ధికి కృషి

రాజ్యసభ్యుడిని కలిసిన నందలూరు నాయకులు నందలూరు రైల్వే సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నందలూరు పూర్వ వైభవానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, సయ్యద్ అమీర్ ఏజీపీ షమీవుల్లా ఖాన్, న్యాయవాది షేక్ మహబూబ్ అలీ, మండల కో–ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్, రిటైర్డ్ రైల్వే ఎంప్లాయి మక్కా మాహబూబ్ బాషా, కమల్ బాషా నాయకులు నవాబ్ జాన్, మున్నా, హిమగిరినాథ్ యాదవ్, సలీమ్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

అలానే రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డిని తిరుపతి ఎమ్మెల్యే సోదరుడు భూమన శంకర్ రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ సేవలకు నిలయాలు సచివాలయాలు

ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్ రెడ్డిలు



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్ రెడ్డి

ఓబులవారిపల్లె (పెనగలూరు): సచివాలయాలు ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించే నిలయాలకు మారాయని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు అన్నారు. సోమవారం మండలంలోని కట్టావారిపల్లెలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న రాజ్యం రావాలంటే గ్రామస్థాయిలోనే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించి పరిపాలించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంకల్పంగా పెట్టుకున్నారని తెలిపారు. సచివాలయాలు ప్రజలకు, రైతులకు ఎంతో ఉపయుక్తంగా మారాయన్నారు. సచివాలయాల్లో 42 రకాల సేవలను పొందవచ్చన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు అందుతున్న సేవలను వివరించారు. మండలంలో 14 సచివాలయాలు, 14 రైతు భరోసా కేంద్రాలు, 14 ఆసుపత్రులను నిర్మించి ప్రజలకు అన్ని సౌకర్యాలు అందిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు తిరిగి ప్రజలకు అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు తెలియజేశారు. కట్టావారిపల్లి దళితవాడకు ఆర్‌ఓ ప్లాంట్ ఇంకా రాలేదని దళితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే జిల్లాస్థాయి అధికారులతో చర్చించి నాలుగు రోజుల్లోపు మంజూరు పత్రాలను అందించాలన్నారు. అంతకుముందు కొండూరు అజయ్ రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకొని గ్రామస్థాయి నుంచే పరిపాలన సాగించే విధంగా ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీలలో భాగంగానే సచివాలయాలు ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ వ్యవస్థ పేద ప్రజలు, పేద రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని వారు తెలియజేశారు. రాబోయే ఎన్నికలలో ప్రజలు ఎవరి మాటలు వినకుండా జగన్ వెంటే ఉండాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొండూరు విజయ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ బాలు మోహనమ్మ, కాంట్రాక్టర్లు రామాంజనేయులు నాయుడు, శివయ్య నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంజనేయులు రెడ్డి, సుబ్బారెడ్డి, పేరంవారిపల్లి రెడ్డయ్య నాయుడు, లేబాకు వెంకటరెడ్డి, ఈట మాపురం శంకర్ రెడ్డి, నాగసుబ్బారెడ్డి, పెనగలూరు సొసైటీ ఉపాధ్యక్షుడు జయరామయ్య, కన్నా రెడ్డి, సర్పంచ్ శివయ్య నాయుడు, వేణుగోపాల్ నాయుడు, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జీల ఏర్పాటు హర్షనీయం

రైల్వేకోడూరు : నియోజకవర్గ పరిధిలోని పుల్లంపేట, ఓబులవారిపల్లె, కోడూరు మండలాల్లో అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బైపాస్‌లు నిర్మించడం హర్షనీయం అని సోమవారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని బంగ్లా మిట్టలో రైల్వే అండర్ బైపాస్ ఓవర్ బ్రిడ్జి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ప్రజల సౌకర్యాల కోసం ఈ బ్రిడ్జీలు నిర్మించడం సంతోషకరమన్నారు. గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడంలో ఇది ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, సర్పంచ్‌లు సుబ్బయ్య, గోపి, హరిక్రిష్ణారెడ్డిలు, మాజి సర్పంచ్ మావిళ్ల సుబ్రమణ్యం, ఉప సర్పంచ్ దాడిశెట్టి సిద్ధు, వెంకటరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాబు రెడ్డి, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి

వీరబల్లి (రాయచోటి టౌన్) : పార్టీలకతీతంగా, కులం, మతం అనే తేడా లేకుండా అర్హత ఒక్కటే ఆధారంగా ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు సీఎం జగన్ అందిస్తున్నారని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి అన్నారు. సోమవారం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించారన్నారు. సీఎం జగన్ అర్హత ఉంటే చాలు వారి ఇంటి వద్దకే సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ప్రజారోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష తీసుకొచ్చి అందరికీ వైద్య పరీక్షలు చేయించారన్నారు. ప్రజారంజకమైన పాలన కోసం మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వీఆర్‌డీఎస్ చైర్మన్ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఆలయ వార్షికోత్సవం

చిట్వేలి : చిట్వేలి బ్రాహ్మణ వీధిలో వెలసివున్న మారెమ్మతల్లి ఆలయ మొదటి వార్షికోత్సవం శనివారం ప్రారంభమై సోమవారం ఉయ్యాలసేవతో ఘనంగా ముగిసింది. వార్షికోత్సవం సందర్భంగా మైలపల్లి వడ్డిపల్లి గ్రామస్తుడు తమ్మిశెట్టి నాగేశ్వర రావు ఉత్సవ విగ్రహాన్ని సమర్పించగా, చెన్నై వాస్తవ్యులు పి.శ్రీనివాసులు, పి.మనోహరరావు కుటుంబాలు అభిషేక విగ్రహాన్ని ఆలయానికి సమర్పించారు. సోమవారం ఉదయం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించగా సాయంత్రం 7.30 గంటలకు ఉయ్యాలసేవను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాయపెద్ది వెంకట సత్యనారాయణ శర్మ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

ధ్యానం ద్వారా ఏకాగ్రత

రాయచోటి టౌన్ : ధ్యానం ద్వారా ఏకాగ్రత లభిస్తుందని ధ్యాన గురువు మేడసాని మోహన్ అన్నారు. సోమవారం రాత్రి సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న ధ్యాన సప్తాహ మహా సభలు రెండో రోజుకు చేరాయి. మహా సభలకు మేడసాని మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భూమిపై అనేక కోట్ల జీవరాసులు పుట్టాయని అయితే వీటిన్నంటిలో కల్లా ఉత్తమైన జీవితం మానవ జీవితమేనని చెప్పారు. పుట్టిన ప్రతి ఒక్కరూ ఉత్తమమైన జీవుడిగా మారాలని చెప్పారు. ధ్యానం ద్వారా ఆత్మజ్ఞానం లభిస్తుందని ఆత్మజ్ఞానం ద్వారా మోక్షం లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజూ ధ్యానసాధన చేయాలని సూచించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు దేవకీ సురేష్ కుమార్, డాక్టర్ హరిణి, డాక్టర్ బయారెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా ధ్యాన మహాసభల్లో రాయచోటి వాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

నివాళి

రామాపురం : మండలంలోని హసనాపురం గ్రామం గొల్లపల్లికి చెందిన సహదేవరెడ్డి తండ్రి యర్రంరెడ్డి పెద్దకర్మకు మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట నాగేంద్రరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, హరినాథరెడ్డి, నాగబసిరెడ్డి, శివారెడ్డిలు ఉన్నారు.

పున్నాటివారిపల్లె అండర్ బ్రిడ్జి పనులకు శ్రీకారం



పుల్లంపేట: మాట్లాడుతున్న రాంప్రసాద్ రెడ్డి



ఓబులవారిపల్లె: పాల్గొన్న రైల్వే అధికారులు, సర్పంచ్

ఓబులవారిపల్లె : అమృత్ భారత్ పథకంలో భాగంగా పున్నాటివారిపల్లెలోని రైల్వే అండర్ బ్రిడ్జీ నిర్మాణ పనులను ప్రారంభించారు. సోమవారం ఈ పనులను ప్రధాని నరేంద్రమోడీ వర్చువల్ విధానంలో రూ.9 కోట్లతో అండర్ బ్రిడ్జీ పనులకు శ్రీకారం చుట్టారు. రైల్వే అధికారి ఐఓడబ్ల్యూ రమణారావు మాట్లాడుతూ రైల్వే గేటు ఉన్న ప్రదేశంలో ప్రతిచోట అండర్ బ్రిడ్జీలను ఏర్పాటు చేస్తామని, తద్వారా అత్యవసర సమయాలలో ఆటంకం కలుగకుండా ప్రయాణాలు సాగించవచ్చని తెలిపారు. అనంతరం అండర్ బ్రిడ్జీ ప్రారంభోత్సవ శిలాఫలకాలను సర్పంచ్ జయపాల్ రెడ్డి, రైల్వేశాఖ అధికారులు ఆవిష్కరించారు. అనంతరం ఓబులవారిపల్లె జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాగితపు సుజాత, రైల్వేశాఖ అధికారులు రాజశేఖర్ రెడ్డి, గుత్తేదారులు సంజీవరెడ్డి, పట్టాభి, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, బీజేపీ నాయకులు గడ్డం చెంగల్‌రాజు, చిన్నిరెడ్డి గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : అమృత్ భారత్ పథకంలో 554 అండర్ బ్రిడ్జీలను నిర్మించనున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. సోమవారం అప్పారాజుపేట పంచాయతీలో రైల్వే అండర్ బ్రిడ్జీ పనులకు ప్రధాని నరేంద్రమోడీ అంకురార్పణ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముస్తాక్, గుంతకల్ రైల్వే బోర్డు మెంబర్ రాంప్రసాద్ రెడ్డిలు మాట్లాడుతూ రైల్వే అండర్ బ్రిడ్జీలను ఆధునీకరించడం హర్షించదగ్గ విషయమన్నారు. బ్రిడ్జీ అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంత వాసుల కష్టాలు తీరుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓపీఎస్ హామీ ఇచ్చేవారికే మా ఓటు

రాయచోటి అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ అమలుపై పూర్తిస్థాయిలో హామీ ఇచ్చిన పార్టీకే తమ ఓట్లు వేస్తామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని అలీమాబాద్ వీధిలోని ఉర్దూ ఉన్నత పాఠశాల ఆవరణలో ఓట్ ఫర్ ఓపీఎస్ బుక్‌లెట్‌లను ఆయన ఆ సంఘం నేతలతో కలసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం అంశంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. సీపీఎస్, జీపీఎస్ అమలు వలన ఉద్యోగ, ఉపాధ్యాయులకు కలిగే నష్టాలను ఓట్ ఫర్ ఓపీఎస్ బుక్‌లెట్ ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు రాజారమేష్, హఫీజుల్లా, చాన్‌బాషా, రాజబాబు, రామ్మోహన్‌రెడ్డి, ఇలియాస్, జగదీష్, మహమ్మద్‌బాషా, రహంతుల్లా, రహీంఖాన్, జయన్ననాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారంలో కేంద్రం నిర్లక్ష్యం



నిరసన ప్రదర్శనలో రైతు, కార్మిక సంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : కేంద్రంలో ప్రధాని మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని కార్పొరేట్లకే కొమ్ముకాస్తున్నదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు ఆరోపించారు. రైతుల సమస్యల పరిష్కారంలో పాలకులు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దేశంలోని కార్మిక వర్గాన్ని కార్పొరేట్లకు బానిసలుగా చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. బీజేపీతో రాష్ట్రంలోని టీడీపీ, జనసేన పార్టీలు జతకట్టడం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టడమే అంటూ మండిపడ్డారు. రైతాంగ వ్యతిరేక చర్యలను నిరసిస్తున్న రైతులపై ప్రభుత్వం రబ్బరు బుల్లెట్లతో కాల్పులు జరపడి, బాష్పవాయువును ప్రయోగించడం దారుణమన్నారు. బ్రిటీషు పాలన కాలంలోని జనరల్ డయ్యర్ కంటే నేటి మోడీ ప్రభుత్వం విచక్షణా రహితంగా వ్యవహరిస్తోందంటూ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, రైతు సంఘం నేతలు భాస్కర్‌రెడ్డి, నాగులయ్య, రమణయ్య, ప్రసాద్, వెంకటేష్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలపై అవగాహన అవసరం



బహుమతులు గెలుపొందిన వారితో టీచర్లు

రాయచోటి టౌన్ : విద్యార్థి దశ నుంచే నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించుకోవాలని డైట్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మలా దేవి విద్యార్థులకు సూచించారు. సోమవారం డైట్ కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు వస్తువులు, వాటి నాణ్యతా ప్రమాణాలు అనే అంశాలపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (భారతీయ ప్రమాణాల సంస్థ) వారి ఆధ్వర్యంలో స్టాండర్డ్స్ క్లబ్ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వస్తువులు కొనుగోలు చేయడం, వాటి నాణ్యతా ప్రమాణాలను తెలుసుకోవడం వంటి విషయాలను వివరించారు. ఇలాంటి క్లబ్‌లు నిర్వహించి అవగాహన సదస్సును నిర్వహించడం వలన విద్యార్థులకు మంచి అవగాహన కలిగి నాణ్యతపై స్పష్టత తెలుసుకొనే అవకాశం ఉందని ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ కె.శ్రీనివాస రాజు అన్నారు. అనంతరం వస్తువులు, వాటి నాణ్యత వంటి అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు మెమొంటోలు కూడా అందించారు. కార్యక్రమంలో లోకేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, ఫణీంద్ర, తౌఫిక్, అలీ తదితరులు పాల్గొన్నారు.

కోడూరు అభివృద్ధే ధ్యేయం

రైల్వేకోడూరు అర్బన్ : కోడూరు పట్టణంలోని హిందూ స్మశానవాటికలో దహన సంస్కారాలకు ఏర్పాటు చేసిన యంత్రాన్ని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా ఏపీఎండీసీ, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో ప్రత్యేక గ్యాస్ ద్వారా దహన సంస్కారాల మిషన్ ఏర్పాటు చేశామని తెలిపారు.